క్లుప్తంగా

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే'


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అలీ

మునగపాక: వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ సూచించారు. ఆదివారం మునగపాక మెయిన్‌రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసినా చర్యలు తప్పవన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరికన్నా ఎక్కువ మంది ప్రయాణించరాదన్నారు. అతి వేగం ప్రమాదకరమన్నారు. తల్లితండ్రులు మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఎస్ఐ మన్మథరావు ఉన్నారు.

సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి


మాట్లాడుతున్న డాక్టర్ ప్రవళిక

మునగపాక: సీజన్‌లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవళిక సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఉమ్మలాడలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ(ఎస్ఆర్), ఉప సర్పంచ్ మందా రాము, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు మొల్లేటి వినోద్, ఎంపీడీవో మన్మథరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు


వినోద్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మునగపాక మండల యువజన విభాగం అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన మొల్లేటి వినోద్‌ను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలన్నారు. ఇప్పటికే అమలు చేస్తున్న పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాల్సిందిగా సూచించారు. పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఉంటుందని, అందుకు తాజా నియామకాలే నిదర్శనమని పేర్కొన్నారు. ఏ పార్టీలోనూ చిత్తశుద్ధితో పనిచేసే వారికి ఇంత వేగంగా గుర్తింపు దక్కే పరిస్థితి లేదని, సీఎం జగన్ చొరవతోనే పార్టీలో ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తోందని వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, ఎంపీ డాక్టర్ సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మలకు వినోద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు, పార్టీ నేతలు షేక్ ఇస్మాయిల్, నూకరాజు, రమణబాబు, జగన్నాథరావు, పల్లె అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

రాంబిల్లి: ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం నుంచి చలిగాలులు ప్రారంభమై రాత్రి వేళల్లో గజగజా వణికిస్తున్నాయి. గ్రామాల్లో మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. చలి తీవ్రతతో రాత్రి 8 గంటలకే గ్రామాలు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు చలి ధాటికి బెంబేలెత్తిపోతున్నారు.

మనసున క్రీస్తును ధరియించి..

- నేడు క్రిస్మస్ పండగ
- వేడుకలకు ముస్తాబైన చర్చిలు


విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న పట్టణంలోని రోమన్ కేథలిక్ చర్చి

యలమంచిలి రూరల్: ప్రపంచ వ్యాప్తంగా ఒకే తేదీన ఒకే సమయంలో ఎక్కువ మంది జరిపే పండగ క్రిస్మస్. ఏటా డిసెంబర్ 25న క్రీస్తు జన్మదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. లాటిన్ భాషలో 'క్రిస్'అనగా క్రీస్తు, మాస్ అనగా ఆరాధన. సత్యం, శాంతి, దయ, త్యాగం, కరుణ, ప్రేమ, నిరీక్షణ వంటి సందేశాలతో క్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. ఈ పర్వదినం నెల రోజుల ముందు నుంచే అన్ని చర్చిల్లోనూ రోజూ తెల్లవారుజామున 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి.

కాంతులీనుతున్న క్రైస్తవ మందిరాలు

క్రిస్మస్ సందర్భంగా యలమంచిలి పట్టణం, మండలంలోని గ్రామాల్లో క్రైస్తవ ప్రార్థనా మందిరాలు విద్యుద్దీపాలంకరణలతో కాంతులీనుతున్నాయి. పట్టణంలోని కాకివాని వీధి పురాతన ఆంధ్రా సెంటినరీ బాప్టిస్టు చర్చి, బైపాస్ రోడ్డులోని రోమన్ కేథలిక్ చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు, గంటలు, శాంతాక్లాజ్‌లను ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక ఏబీసీ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పిల్లలు ప్రత్యేక క్రైస్తవ గీతాలను ఆలపించారు. లైను కొత్తూరు న్యూలైఫ్ సంస్థలో విద్యార్థులు క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే నాటికను ప్రదర్శించారు.

మార్కెట్లకు క్రిస్మస్ శోభ

మార్కెట్లో ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. ఫ్యాన్సీ దుకాణాల వద్ద క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు, అలంకరణ సామాగ్రి అమ్మకాలతో సందడి నెలకొంది. ఇక కేక్‌ల ఆర్డర్లతో బేకరీలు, స్వీట్ దుకాణాలు రద్దీగా మారాయి. పిల్లలకు క్రిస్మస్ తాతయ్య దుస్తులు, మాస్కులు, బెలూన్ లైట్లు, గ్లాస్ స్టార్‌లు, ఇంటి అలంకరణకు రంగు రంగుల విద్యుత్ సెట్లను క్రైస్తవులు పెద్దఎత్తున కొనుగోలు చేశారు.

కోటవురట్ల: మండలంలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. రాట్నాలపాలెంలోని క్రీస్తు కృపాల బాప్టిస్టు చర్చి, బేతస్థ ప్రార్థనా మందిరం, ఎల్‌షద్దాయ్ ఆరాధనా మందిరం, పల్లెల్లో ఉన్న అనుబంధ చర్చిలు విద్యుద్దీపాలంకరణతో మెరిసిపోతున్నాయి. ఇళ్లపై స్టార్స్ కనువిందు చేస్తున్నాయి. సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రోజంతా ప్రత్యేక ప్రార్థనలతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు.

ఘనంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

రాంబిల్లి: కొత్తూరులో ఆదివారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ మత బోధకులు డాక్టర్ కె.పీటర్, డాక్టర్ జగదీష్ పాల్‌లు క్రీస్తు బోధనలను వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో కొత్తూరు తదితర ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. కొరుప్రోలు, తిమ్మాపురం, దార్లపూడి, పెద ఉప్పలం, ఎస్.రాయవరం తదితర గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు భారీ ఎత్తున నిర్వహించడం ఆనవాయితీ. క్రిస్మస్ రోజున ప్రత్యేక ప్రార్థనలతో పాటు, నిరుపేదలకు వస్త్రాల పంపిణీ, అన్న సమారాధనలు నిర్వహించనున్నారు. ఈ మేరకు చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.


రాట్నాలపాలెం కేకేబీ చర్చికి విద్యుద్దీపాలంకరణ


ముస్తాబైన కాకివానివీధిలోని పురాతన ఏబీసీ చర్చి


కొత్తూరులో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు


విద్యుత్ అలంకరణలో కొరుప్రోలు చర్చి

దశాబ్దాల కల.. నెరవేరే వేళ


రహదారి నిర్మాణానికి కొలతలు తీస్తున్న ఏఈ నారాయణరెడ్డి

కోటవురట్ల: దశాబ్దాలుగా ఎల్‌వీకే రహదారిలో గతుకుల్లోనే వాహనదారుల రాకపోకలు సాగుతున్నాయి. గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. టీడీపీ హయాంలో రెండుసార్లు ఈ రోడ్డు పునరుద్ధరణకు హామీలు గుప్పించినా అమలుకు నోచుకోలేదు. అవస్థల మధ్యే వాహనదారుల రాకపోకలు జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పైల రమేష్ ఈ రహదారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం స్పందించడంతో.. ఏళ్లతరబడి ఇక్కట్లకు మోక్షం కలిగినట్లయింది.

రూ.2.60 కోట్లు మంజూరు

కె.వెంకటాపురం నుంచి కొడవటిపూడి శివారు చిన బొడ్డేపల్లి జంక్షన్ వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు అవసరమైన నిధులు రూ.2.60 కోట్లను మంజూరు చేసింది. దీంతో రోడ్డు పునరుద్ధరణ పనులకు అధికారులు చర్యల్లోకి దిగారు. ఆర్‌అండ్‌బీ ఏఈ కె.నారాయణ రెడ్డి కె.వెంకటాపురం గ్రామం మెయిన్‌రోడ్డును తాజాగా పరిశీలించారు. రహదారి నిర్మాణానికి సంబంధించి కొలతలు తీశారు. జనవరి ఒకటో తేదీ నుంచి మార్కింగ్ ఇచ్చి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. సాధ్యమైనంత తొందరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

20 ఏళ్ల సమస్యకు పరిష్కారం

ఎల్‌వీకే రహదారిలో తుని వెళ్లేందుకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనాల రద్దీతో 20 ఏళ్లుగా రోడ్డు శిథిలావస్థకు చేరుకుని, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి, రూ.2.60 కోట్ల నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. రహదారి నిర్మాణం పూర్తయితే వాహనదారుల ఇక్కట్లకు ముగింపు పడనుంది. రోడ్డు అభివృద్ధికి సహకరించిన ప్రభుత్వానికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు.

– పైల రమేష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

పూర్వ విద్యార్థుల సందడి


మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1987-88 బ్యాచ్ విద్యార్థులు


మునిలితల్లి గుడి వద్ద సమావేశమైన 1988-89 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు


పరదేశమ్మ తల్లి గుడి ప్రాంగణంలో 1985-86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

- పలు చోట్ల ఆత్మీయ సమావేశాలు

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో పలు బ్యాచ్‌లలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాలు ఆదివారం జరిగాయి. దీంతో మునగపాక సందడిగా మారింది. మునగపాక జెడ్పీ హైస్కూల్ 1987–88 టెన్త్ బ్యాచ్ 35 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తాము చదువుకున్న స్కూల్లో కలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు, మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి సుధారాణి, విశాఖ మూడవ పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరావు, రైల్వే ఉద్యోగులు షేక్ నాగూర్, పెంటకోట ఓం శ్రీనివాసరావు, ఆదినారాయణ నాయుడు, జగ్గు, మళ్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- 1988–89 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సమీపంలోని మునిలితల్లి అమ్మవారి గుడి ప్రాంగణంలో సమావేశమయ్యారు. మళ్ల జోగారావు, ఉమామహేష్, ఎస్.ప్రసాద్, పీవీఎస్ తదితరులు సమావేశానికి నేతృత్వం వహించారు.
- ఇదే హైస్కూల్లో 1985–86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మునగపాకలోని పరదేశమ్మతల్లి గుడి ఆవరణలో వన సమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. వెలగా శ్రీనివాసరావు, దొడ్డి గోవింద, కొయిలాడ దశావతారం, ఆడారి సతీష్, మళ్ల సత్యనారాయణ, వేగి దేవత మల్లునాయుడు, కేవీఎస్ అప్పారావు, బీవీ రమణ తదితరులు హాజరయ్యారు.

బ్రాండిక్స్‌లో 330 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం: బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 330 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 250 మందికి కళ్లద్దాలు, 117 మందికి మందులు అందించారు. 25 మందికి కేటరాక్ట్ సర్జరీ అవసరమని వైద్యులు సూచించారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి శిబిరాన్ని పరిశీలించి, కంటి బాధితులతో మాట్లాడారు.


బ్రాండిక్స్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

భవానీల భక్తి పారవశ్యం

- అంబరాన్నంటిన శూలాల సంబరం
- మార్గశిర శోభతో ధర్మవరం


శరీరం నిండా శూలాలు ధరించి ఊరేగింపు చేపడుతున్న భవానీ భక్తులు


నోటిలో శూలాలు గుచ్చుకుని ఊరేగింపు చేస్తున్న దీక్షా పరులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని ధర్మవరం మార్గశిర శోభతో కళకళలాడుతోంది. తొలి రోజు నుంచి కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక భావనతో పులకిస్తున్నాయి. ఇప్పటికే బోనాల ఊరేగింపు, సారె సమర్పణ, సామూహిక కుంకుమార్చనలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం భవానీ దీక్షాపరుల శూలాల సంబరాన్ని చూసిన వారంతా భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఏటా మాదిరే ఈ ఏడాది కూడా అమ్మవారి ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఇక్కడ కొలువుదీరిన కనక మహాలక్ష్మి అమ్మవారికి భవానీ మాలధారులు కుంకుమార్చన చేసి, శరణుఘోషతో హారతులిచ్చారు. ఉదయం నుంచి ఉపవాసదీక్ష చేపట్టిన భవానీ భక్తులు నాలుక, రెండు బుగ్గలు, శరీరంపై శూలాలు ధరించి ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాద్యాలు, దీక్షాపరుల దుర్గా నామస్మరణ మధ్య క్లబ్ రోడ్డు నుంచి యలమంచిలి ప్రధాన రహదారి మీదుగా ప్రారంభమైన ఊరేగింపు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకోవడంతో ముగిసింది. అమ్మవారి ఘటాన్ని కూడా ఊరేగించడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోటవురట్ల మండలం ఎన్‌జీ పాలెం గ్రామానికి చెందిన మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తాటిపాకల చిన్ని, మడగల బాబూరావు, మజ్జి కనక, తాటిపాక మాణిక్యాలరావు(నాని), కొఠారు సాంబ, పలువురు భవానీ మాలధారులు పాల్గొన్నారు.


అమ్మవారి ఘటం ఊరేగింపులో భక్తులు


మహిళల కోలాట ప్రదర్శన

కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా సత్తిబాబు


మోటూరు సత్తిబాబుకు నియామక ఉత్తర్వులు అందిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: కిసాన్ మోర్చా అచ్యుతాపురం అధ్యక్షుడిగా ఆవసోమవరానికి చెందిన మోటూరు సత్తిబాబు నియమితులయ్యారు. ఎలమంచిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు ఆదివారం ఉత్తర్వులు అందించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సతీష్ రాజు, గొంతిన భక్త సాయిరాం, రాజాన రాజు, కూండ్రపు నాయుడుబాబు, మేరుగు కాసుబాబు, మళ్ల కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


మునగపాక హైస్కూల్ 1978-79 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

రాంబిల్లి: పంచదార్ల పుణ్యక్షేత్రం మునగపాక ఉన్నత పాఠశాలలో 1978–79 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులు పరస్పరం పరిచయాలు చేసుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకుని, రోజంతా ఆట పాటలతో ఆనందంగా గడిపారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన సవేత యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చదరం శివాజీ తన టెన్త్ బ్యాచ్ విద్యార్థులతో ఆనందంగా గడిపారు. ఆటపాటలతో అలరించి ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో మానసిక ఆనందం ఎంతో కీలకమైనదన్నారు. ఒత్తిడికి దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. తొలుత ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించి, క్షేత్ర పాలకుడు ఉమా ధర్మలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

పాటిపల్లి-రాజుపేట రోడ్డు నిర్మాణం పట్ల హర్షం


నాబార్డు నిధులతో నిర్మించిన పాటిపల్లి-రాజుపేట రోడ్డు

మునగపాక: మండలంలోని పాటిపల్లి నుంచి రాజుపేటకు వెళ్లే రహదారి పనులు పూర్తయ్యాయి. నాబార్డు ద్వారా విడుదలైన రూ.3.24 కోట్లతో ఈ రహదారిని నిర్మించారు. గతంలో ఈ రోడ్డు అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడేవారు. రోడ్డు దుస్థితిని స్థానికులు ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవ తీసుకుని పాటిపల్లి నుంచి రాజుపేట వరకు రహదారి సదుపాయం కల్పించేందుకు నాబార్డు ద్వారా నిధులు మంజూరు చేయించారు. నాబార్డు డీఈ వీరభద్రరావు రహదారి నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రహదారి నిర్మాణం జరగడం పట్ల పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, స్థానిక నాయకులు కొయిలాడ త్రిమూర్తులు, సత్యనారాయణ, నరసింహారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

యలమంచిలి: మండలంలోని 10 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం నుంచి ఆడుదాం ఆంధ్రా.. క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని ఎంపీడీవో అప్పలనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి జనవరి 9 వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో పురుషులు, మహిళలకు వేరు వేరుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాల్సిందిగా కోరారు.

రేవుపోలవరం హైస్కూల్ భవన నిర్మాణానికి చర్యలు

- అడ్డుకుంటున్న వారికి ఆ భూమిపై ఎలాంటి హక్కులు లేవు
- నేటి నుంచి నిర్మాణ పనులు– తహసీల్దార్ విజయ్‌కుమార్


ప్రారంభంలోనే నిలిచిన నాడు-నేడు పనులు

ఎస్.రాయవరం: రేవుపోలవరం ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. ప్రభుత్వం నాడు–నేడు పథకం రెండో విడతలో రూ.2.97 కోట్లు కేటాయించింది. ఈ మొత్తంతో భవన నిర్మాణానికి ఆగస్టు నెలలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు శంకుస్థాపన చేశారు. పాఠశాల భవనానికి కేటాయించిన స్థలం ప్రభుత్వ భూమి అయినప్పటికీ, పెదఉప్పలం గ్రామానికి చెందిన ఓ మహిళ అడ్డుకోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. పునాదులు తవ్వినపుడు లేని ఆటంకం, కాంక్రీట్ పనులు మొదలయ్యాకే వచ్చిందని కాంట్రాక్టర్ చెబుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే మండల అధికారులతో పాటు, జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించి భవన నిర్మాణం ప్రారంభించాలని ఆదేశించారు. అయినప్పటికీ స్థానిక అధికారులు స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాల రేవుపోలవరం, కొత్త రేవుపోలవరం గ్రామస్తులతో పాటు బంగారమ్మపాలెం, చినఉప్పలం, కాపుల వాతాడ, సమీపంలోని జగనన్న కాలనీవాసులకు ప్రయోజనకరమని చెబుతున్నారు. రెండేళ్ల క్రితం రేవుపోలవరం పాఠశాలలో 10వ తరగతి విద్యా బోధన ప్రారంభించారు. పాఠశాలలో అన్ని తరగతులు నిర్వహించేందుకు సరిపడా వసతిలేక తుపాను రక్షిత భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ గుర్తించిన ప్రభుత్వం అదనపు తరగతి గదులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. ఇప్పటికే రూ.18 లక్షల విలువ చేసి భవన నిర్మాణ సామగ్రిని ప్రాంగణంలో వేశారు. అధికారులు చొరవ తీసుకుని పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయమై స్థానిక తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా భవనానికి భూమి కేటాయించినపుడు ఎవరూ అడ్డుకోలేదని, కొంత పని ప్రారంభించాక ఆ స్థలం తమదంటూ నిర్మాణ పనుల్ని అడ్డుకున్నట్లు ఫిర్యాదు వచ్చిందన్నారు. అయితే వారికి ఎటువంటి హక్కులు లేవని సోమవారం నుంచి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.